క్లుప్తంగా

జంపెనలో వాసవీమాతకు విశేష పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మాడుగుల రూరల్: జంపెన వాసవీమాత ఆలయంలో ఆదివారం మహిళలు కుంకుమ పూజలు, పంచామృతభిషేకాలు చేశారు. అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా సంకీర్తన, అనంతరం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కింతలి గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.కోడూరు, వీరవల్లి, కె.జె.పురం, మాడుగుల, కింతలి ఐక్యత వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వాసవీ మాత ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టా మోహన్‌రావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గొలుగొండ: రావణాపల్లి రామాలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



ఆంజనేయస్వామి ఆలయంలో పూజలను నిర్వహిస్తున్న భక్తులు

కె.కోటపాడు: గొండుపాలెంలో ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్వామివారికి సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, ఉపాధ్యాయుడు బండారు మంగపతి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. తీర్థం సందర్భంగా మహిళల కోలాటాలు, వాలీబాల్ పోటీలను నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాలు అందించారు.

పట్టాలను పునరుద్ధరించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న గిరిజన రైతులు

రావికమతం: రీసర్వేలో స్థానిక రెవెన్యూ సిబ్బంది పొరపాట్లు కారణంగా రద్దయిన తమ పట్టాలను పునరుద్ధరించాలని కొట్నాబిల్లి గ్రామా నికి చెందిన గిరిజన రైతులు తమ పొలాల్లో ఆదివారం నిరసన చేపట్టారు. సర్వే నంబరు 129/1,129/2 తదితర సర్వే నంబర్లలో 16 ఎకరాల భూమిని 17 కుటుంబాల వారు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారని, 1976లో తమ పెద్దలకు ల్యాండ్ సీలింగ్ పట్టాలిచ్చారని, పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం రీసర్వే తర్వాత ఆ భూములు 22ఎ జాబితాలోకి వెళ్లిపోయాయని అధికారులు తక్షణమే స్పందించి తమ పట్టాలను పునరుద్ధరించాలని అప్పిలి గడ్డమ్మ, దోని రాజేశ్వరి, చిన్ని నూకాలమ్మ, నందిల చెంచమ్మ తదితర రైతులు నిరసన వ్యక్తం చేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక అభిషేకాలు

అనకాపల్లి : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా మెయిన్‌రోడ్డులో గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున నగర సంకీర్తనను పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టణంలో ఊరేగించారు. ఆలయంలో అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో కూడిన పంచామృతాభిషేకం చేపట్టారు.

అక్క చెల్లెమ్మలకు ఆసరా

ఎన్నికల సమయంలో ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించడం.. పదవి చేతికి రాగానే వాటిని తుంగలో తొక్కడం పరిపాటి. ఇందుకు భిన్నంగా కొంతమంది నేతలు మాత్రమే అరుదుగా ఉంటారు. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవడమే కాకుండా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటారు. అటువంటి కోవకు చెందిన వారే అప్పుడు మహానేత వైఎస్సార్.. ఇప్పుడు తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..

- నేడు నాల్గో విడత చెక్కుల పంపిణీ
- నర్సీపట్నం నియోజకవర్గంలో 55,979 మహిళలకు రూ.158.49 కోట్ల లబ్ధి
- హాజరు కానున్న ఎమ్మెల్యే గణేష్



డ్వాక్రా మహిళలు(ఫైల్)

నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాలు సభ్యులు ఆసరా సొమ్ము వివరాల

మండలం పేరు	సంఘాల సంఖ్య	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం నగదు
నాతవరం	1,321	14,421	రూ.37.97 కోట్లు
నర్సీపట్నం రూరల్	659	7,082	రూ.23.87 కోట్లు
మాకవరపాలెం	1,236	13,597	రూ.37.3 కోట్లు
గొలుగొండ	1,022	10,799	రూ.28.74 కోట్లు
మున్సిపాలిటీ			
నర్సీపట్నం	989	10,074	రూ.30. 88 కోట్లు
మొత్తం	5,227	55,973	రూ. 158.49 కోట్లు

నాతవరం: కుటుంబంతోపాటు సమాజం అభివృద్ధి చెందడానికి మహిళ పాత్ర కీలకంగా భావిస్తుంటాం. దీని ప్రాధాన్యతను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా నెరవేర్చుతున్నారు. డ్వాక్రా మహిళలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకులో తీసుకున్న బాకీలను మాఫీ చేస్తానని హామీచ్చారు. ఆ ప్రకారం మొత్తం బాకీని వైఎస్సార్ ఆసరా పథకంలో నాలుగు విడతలుగా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తోంది. ఇంతవరకు మూడు విడతలు జమ చేయగా, నాల్గో విడత ప్రస్తుతం లబ్ధిదారుల ఖాతా లోకి జమ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నర్సీపట్నం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో డ్వాక్రా మహిళల ఖాతాల్లోకి ఆసరా సొమ్ము జమ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సోమవారం ప్రారంభించనున్నారు. మొదటిగా నాతవరం మండలంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం నాలుగు మండలాల్లో మొత్తం 4,238 సంఘాలకు 45,899 మంది లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ.127 కోట్లు చెల్లిస్తోంది. ఇప్పటికే మూడు విడతలు పంపిణీ చేయగా, ఆఖరు విడత నేడు అందించనున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. గత టీడీపీ పాలనలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మహిళలను మోసం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా సకాలంలో హామీని అమలు చేశారు. మాకు అందరికి సంతోషంగా ఉంది.

– పోలుపర్తి రాధ, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, నాతవరం

ఏర్పాట్లు పూర్తి చేశాం



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చెక్కులు అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నాం. డ్వాక్రా మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను సభ వద్ద స్టాళ్లలో ప్రదర్శించనున్నారు.

– జాగారపు రాంబాబు, ఎంపీడీవో, నాతవరం

హామీలు అమలు చేశాం



నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను యధావిధిగా అమలు చేశాం. హామీల్లో లేనివి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి చూపించారు. రాజకీయాలకు పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించాం. డ్వాక్రా మహిళల విషయంలో ఏనాడూ మాట తప్పలేదు. ఎన్నికల ముందే హామీలను నెరవేర్చారు. దీన్ని గుర్తించి మరలా రెండో సారి గెలిపించేందుకు ఆశీర్వదించాలని కోరారు.

– పెట్ల ఉమా శంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సూర్యకాంతం

మాడుగుల: డి.గొటివాడ ఉరకగెడ్డ నుంచి సాగరం కాలనీ మీదుగా మాడుగుల దేవి ఆలయం వరకు రహదారి నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. సాగరం ఎంపీటీసీ సభ్యురాలు శ్రీనాథు సూర్యకాంతం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో పీఎంజీఎస్‌వై కింద రూ.4 కోట్లతో ఏడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మించనున్నారు. కార్యక్రమంలో సాగరం, డి.గొటివాడ, శంకరం సర్పంచ్‌లు కోట్ని జయమ్మ, గోకాడ అర్జున్‌రావు, శోలెం రమేష్, నాయకులు శ్రీనాథు జగ్గారావు, అల్లు రమణ, రోబ్బా రాజు, పాము వెంకట్రావు, గుమ్మాల కొండలరావు, గోకాడ అప్పలనాయుడు, కోట్ని సన్యాసినాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



తాతబాబు

రావికమతం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రావి కమతం పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు కంచిపాటి పరదేశినాయుడు అలియాస్ తాత బాబు (57) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శనివారం రాత్రి అతడికి గుండెపోటు రావడంతో చికిత్సకు తరలిస్తుండగానే మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

ప్రమాద బాధితులకు సీఎం సహాయ నిధి

ఇద్దరికి రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందజేసిన డిప్యూటీ సీఎం బూడి



బాధితులకు డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి: వివిధ ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన దేవరాపల్లికి చెందిన సబ్బవరపు ఎర్రినాయుడు, ఆబోతు రమణలకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఇంటింటా పర్యటించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వీరి సమస్యను గుర్తించి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వీరికి సీఎం సహాయ నిధి నుంచి రూ. 3 లక్షలు చొప్పున మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఆదివారం దేవరాపల్లి బహిరంగ సభలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తిలతో కలిసి అందజేశారు. తాము అడగకుండానే రోజుల వ్యవధిలోనే చెక్కులు మంజూరు చేసిన సీఎంతోపాటు డిప్యూటీ సీఎంకు ఎంపీపీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



చిన అప్పనపాలెంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

బుచ్చెయ్యపేట: చిన అప్పనపాలెంలో 32 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు సందడి చేశారు. దిబ్బిడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1992–93 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఇక్కడ మామిడి తోటలో ఆదివారం కలుసుకున్నారు. అప్పట్లో 36 మంది కలిసి చదువుకోగా 30 మంది హాజరయ్యారు. వీరంతా వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో స్థిరపడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ తమ కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని ఆనందించారు. ముమ్మిడిశెట్టి గోవిందరావు, కింగ్ రాజు, సీరా అర్జునరావు, ఐయితరెడ్డి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

వైభవంగా గౌరమ్మ నిమజ్జనోత్సవం



గవరపేట పెద్దగుమ్మం వద్ద శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కశింకోట : కశింకోటలో ప్రసిద్ధి చెందిన డీపీఎన్ జెడ్పీ హైస్కూలు వద్ద వెలసి ఉన్న గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గౌరమ్మను వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శారదానది వరకు ఊరేగించారు. భక్తులు ఉత్సాహంగా రథాన్ని ముందుకు తాళ్లతో లాగారు. బాణ సంచా వెలిగించారు. నది ఒడ్డున సంప్రదాయంగా వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం జరిపారు. కాగా గౌరమ్మ ఉత్సవం పురస్కరించుకొని శనివారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్, డాన్స్ మస్తీ, బుర్ర కథలు ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి దాటాక భారీగా బాణసంచా కాల్చారు. ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోపీకృష్ణ, బొడ్డేడ సత్యసాయి బాలాజీ, పెంటకోట రాము, వేగి దొరబాబు, రామకోటేశ్వరరావు, భీశెట్టి ఆనంద్ ఉత్సవంలో పాల్గొన్నారు.

ఆరోగ్యశక్తిని పెంచే ఆయుర్వేదం



ఆయుర్వేద మందులు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ సిద్ధి శ్రీనాథ్

అనకాపల్లి : ఆరోగ్యానికి శక్తిని పెంచేందుకు ఆయుర్వేదం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయుర్వేద వైద్యుడు సిద్ధి శ్రీనాథ్ అన్నారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం లాంగ్ వాకింగ్ నిర్వహించి, యార్డులో గుమస్తాల సంఘం కార్యాలయంలో ఆయుర్వేద మందులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ నేటి సమాజంలో మానసిక ఒత్తిడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిత్యం వ్యాయామం చేయడం వల్ల శరీర ఒత్తిడిని తగ్గించవచ్చన్నారు. ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు మందులు ఉన్నాయన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు శ్రీనాథ్‌ను శాలువాతో సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

వడ్డాదిలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణం



నిర్మాణంలో శ్రీకృష్ణుని ఆలయం

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజర్ పంచాయతీలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ యాదవ కాలనీలో గ్రామ పెద్దలు, యువకులు కలిసి పలువురు దాతల సహాయంతో విరాళాలు సేకరించి విశాలంగా ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణ మండపం, ఆలయ గోపురం పనులు చేస్తున్నారు. వచ్చే కృష్ణాష్టమిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విశాఖ జట్టులో రాణిస్తున్న రావికమతం యువకులు



జట్టులో రావికమతం మండల యువకులు

రావికమతం: విశాఖ నగరంలో నిర్వహిస్తున్న ఆడుదాం–ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ జిల్లా వాలీబాల్ జట్టు ఆదివారం సెమీఫైనల్‌కు చేరింది. ఈ జట్టులో రాణిస్తున్న యువకుల్లో రావికమతం మండలం గుమ్మాళ్లపాడు, చినపాచిలకు చెందిన పవన్‌కుమార్, సాయిబాబా, గుమ్మాళ్లపాడుకు చెందిన బంటు రమేష్, కుమార్ ఉన్నారు. ఆదివారం నెల్లూరు, గుంటూరు జిల్లాల జట్లతో పోటీ పడి విజయం సాధించిన విశాఖ జట్టు సెమీఫైనల్‌కు చేరిందని గ్రామ యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ఆక్రమణలతో ఇబ్బందులు



రోడ్డు స్థలం ఆక్రమణ జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: చీడిగుమ్మల– పుత్తడిగైరంపేట ప్రధాన రోడ్డు ఆక్రమణలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం రాకపోకల సాగిస్తున్న పోలవరం, పాలకపాడు, పుత్తడిగైరంపేట తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కొంతమంది రైతుల భూములకు ధరలు పెరగడంతో రోడ్డు పక్కనే భూములు ఆక్రమిస్తున్నారు. దాంతో వాహన రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ ప్రసాద్‌ను సంప్రదించగా రోడ్డు ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



నాతవరం: మండలంలో సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల కోలాహలం నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్య ప్రవహించే జలపాతంలో జలకాలాట ఆడేందుకు ఆసక్తి చూపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఉమ్మిడి విశాఖ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్ద ఎత్తున ఇక్కడకు రావడంతో సరుగుడు రోడ్డు కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, నాయకులు

మాకవరపాలెం: నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదివారం ప్రారంభించారు. బి.ఎస్.పేటలో రూ.10 లక్షల టీటీడీ నిధులతో నూతనంగా ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. దీన్ని ఎమ్మెల్యే ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. పూజ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, నియోజకవర్గ సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ బొడ్డు గోవిందరావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాశపు నాగేశ్వరరావు, సర్పంచ్ శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, జిల్లా కార్యదర్శి నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన బాలవికాస్ కేంద్రం ప్రారంభం



బాలవికాస్ గురువులకు సత్యసాయి భక్తి పుస్తకాలను అందిస్తున్న నారాయణపాత్రుడు

కె.కోటపాడు: బాల వికాస్ తరగతులతో విద్యార్థులకు విజ్ఞానం పెరగడంతోపాటు భక్తిభావం కలుగుతుందని మండల సత్యసాయి సేవా కార్యక్రమాల ఇన్‌చార్జి బండారు నారాయణపాత్రుడు తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సూర్రెడ్డిపాలెంలో నూతన బాలవికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సెలవు రోజుల్లో ఇక్కడ రామాలయంలో బాల వికాస్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాల వికాస్ గురువులకు సత్యసాయి భక్తి పుస్తకాలను నారాయణపాత్రుడు అందించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదక్షక్ సమన్వయకర్త కసిరెడ్డి అప్పలనాయుడు, భీమేశ్వరరావు, దేముడు, మాజీ సర్పంచ్ సూర్రెడ్డి కన్నంనాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా నాయకుల వినతి



డిప్యూటీ సీఎం బూడికి వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మాడుగుల: జిల్లా ఐక్య ఉపాధ్యాయ సంఘం(యూటీఎఫ్) జిల్లా నాయకులు ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును తారువ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని, ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వీరి డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి, కార్యదర్శి దొగ్గ శ్రీను, సీనియర్ నాయకులు కుదర కామరాజు, బొడ్డపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలి

నక్కపల్లి : మత్స్యకారులకు వచ్చే ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇచ్చిన పార్టీకే మద్దతు ఇవ్వాలని ఆంధ్ర మత్స్యకార జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నక్కపల్లిలో జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 30 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. జనాభా ప్రాతిపదికన తగిన ప్రాధాన్యం ఉండడం లేదన్నారు. ఎన్నికల్లో ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే మత్స్యకారులను వాడుకుంటున్నారని ఆరోపించారు. కనీసం పది అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను వాడ బలిజ మత్స్యకారులకు కేటాయించాలన్నారు. ఒక రాజ్య సభ స్థానాన్ని కూడా మత్స్యకారులకు ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూడా మత్స్యకారులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు.